# అంధభిక్షువు

= రచన: సి. హెచ్. సోమలింగం =

ఉదయం ఎనిమిది గంట లయింది...

బజారుకు వెళదామని చేతిలో సంచి పట్టుకుని వీధి మెట్లు దిగబోయాను. అపుడే ఒక గుడ్డి బిచ్చగాడు, చేతితో కర్రను నేలను చప్పుడు చేసుకుంటూ, కర్రతో మెట్లను తడుముకుంటూ, మెట్లవద్ద ఆగి, 'అమ్మా! గుడ్డి వాణ్ణి తల్లీ!! కాస్త బిక్షం పెట్టు అన్నపూర్ణమ్మ తల్లీ!!!' అని దీనంగా చెయ్యి చాచి అరిచాడు......

మెట్లు దిగబోయి, చటుక్కున ఆగిపోయాను.

ఆ గుడ్డి వ్యక్తిని పరకాయించి చూసాను. శరీరం, వృద్ధాప్యం, వల్లనూ, తిండి కొరత వల్లనూ, చిక్కి శల్యమయిపోయింది. ఆ ముసలి బిచ్చగానికి, ఈ వృద్ధాప్యంలో ఎవరూ తోడు లేరు కాబోలు, అందుకే పాపం, యింత శ్రమపడి, తిరుగుతున్నాడు. అతని ఒక్క పొట్ట కోసం. అనిపించింది......

జేబిలో చెయ్యి పెట్టి అయిదు పైసలు నాణెం తీసి, ఆ వ్యక్తి చేతిలో వేశాను......ఆ బిచ్చగాని చేతికి స్పర్శ తగలడంతో, ఆ నాణాన్ని వ్రేళ్ళతో తడిమి చూసి, పైసాల్లేవు బాబూ!...చిల్లర పైసా యిప్పించండి బాబూ!! అన్నాడు చేతితో పైకి పట్టుకుని...

అఖ్ఖర్లేదు తాతా! అంతా తీసుకో, అని చెప్పాను.

ఆ వృద్ధుని ముఖంలో ఆశ్చర్యం, సంతోషం కనిపించింది. ఒణుకుతున్న గొంతుకతో, ధర్మ ప్రభువులు. తమరిని దేముడు చల్లగ చూడాలి బాబూ! అని దీవించాడు కర్ర చంకలో పెట్టి నమస్కారం చేస్తూ.

ఎందుకో, పాపం, అతని మీద ఒక విధమైన జాలి వేసింది. ఆ అంధ భిక్షుకుని చూస్తుంటే, మనసులో ఏదో బాధ, విచారం కలిగింది. అతను ఎవరో, ఎక్కడి వాడో, ఇలా పూట్లు పట్టుకు ఎందుకు తిరుగుతున్నాడో, అడగాలని మనసులో కుతూహలం కలిగింది.

అతని వైపు చూసాను...

అతని ముడుతలు పడిన ముఖంలో విచారం తొంగి చూస్తోంది. శతకోటి ముడుతలలో వున్న అతని ఆరాటం ఎంతో అనుభవాన్ని గుర్తు చేస్తోంది. తైల సంస్కారం లేని పండిన తల వెంట్రుకలు అతని ముఖం మీద చిందర వందరగా పడి, అతని వయస్సును తెలియ పరుస్తోంది......

అతను అక్కడ నుండి కదలడానికి ఉద్యుక్తుడైనాడు...

తాతా! పిలిచాను.....

బాబుగారూ!! ... అని చటుక్కున వెనక్కు తిరిగాడు.

ఎవరు తాతా నువ్వు! నీ కెవరూ లేరా!! అని అడిగాను...

ఆ అంధ భిక్షుకుని ముఖంలో విచారం అలముకుంది. కళ్ళనుండి అశ్రువులు రాలి, అతని పండిన గడ్డం మీద పడి జారిపోయాయి...

ఒకపుడు, అందరూ నా వారే బాబూ! కానీ, ఇపుడు, ఈ పరిస్థితిలో నా కెవరూ లేరు బాబూ!! అదంతా, ఒకపుడు చితికిపోయిన పెద్ద కథ బాబూ!!! అన్నాడు విచారంగా......

అతను చెపుతోంటే, అతని మీద ఒక విధమైన జాలీ, సానుభూతీ కలిగాయి. అయితే, నీ కథ వినాలని చాలా కుతూహలంగా వుంది. చెపుతావా తాతా! వింటాను. అన్నాను......

ఆ వృద్ధ భిక్షుకుడు ఆశ్చర్యంతో తన గుడ్డి కళ్ళను పైకెత్తి, అదోలా చూసాడు. అతని పెదవులపై జీవం లేని నవ్వు వెలసి, మాయమయి, దాని స్థానంలో విషాదం అలముకుంది...

బాబూ! నాలుగు వీధులు తిరిగి అడుక్కుంటేనే గానీ, నా పొట్ట గడవదు. అటువంటపుడు నేనేమి చెప్పగలను బాబూ! అన్నాడు ఆ అంధ భిక్షుకుడు.

నిజమే అనిపించింది...మరేం భయపడకు తాతా! ఈ వేళ మా యింట్లో అన్నం పెట్టిస్తాను. అన్నాను.

ఆ అంధుడు మరేం మాట్లాడలేదు. చిత్తం బాబూ! ధర్మ ప్రభువులు. అన్నాడు. నెమ్మదిగా కర్రతో మెట్లను తడుముకుని అరుగుమీదకువచ్చి కూర్చున్నాడు.

బాబూ! అంటూ. ఆ అంధ భిక్షువు కథ చెప్పడం ప్రారంభించాడు ... ఇప్పటికి పాతికేళ్ళ పైమాట బాబూ! నే నొక సామాన్యమైన రైతును. ఇక్కడకు పది పన్నెండుమైళ్ళ దూరంలోవున్న రామాయపాలెం, మా స్వగ్రామం. వ్యవసాయం చేసుకుంటూ, హాయిగా ఏ చీకూ చింతా లేకుండా, కాలం గడిపే వాడిని బాబూ!......

నాకు ఒక్కడే కొడుకు రంగయ్య. నా పెద్ద వయసులో వాడికి, చక్కని పిల్లని చూసి, పెళ్ళి చేసాను చక్కని చుక్కలాంటి పిల్ల. నా యింటికి కోడలుగా వచ్చింది. ఆ పిల్ల వినయం, భయం, భక్తి చూసి నే నెంతో మురిసిపోయాను....నా కుర్రాడూ ఆ పిల్లా ఎంతో చక్కగా సంసారం చేసుకుంటున్నారు,

ఓ గాడు వాడికి ఏం బుద్ధి పుట్టిందో చెప్పకుండా, చెయ్యకుండా మిలటరీకి పారిపోయాడు ... రంగయ్య రెండు రోజులు యింటికి రాకపోవడంతో, బంధువులతో కలిసి ఎంతో వెతికించాను. వాడి పెళ్లాం దుఃఖంతో కుమిలిపోయి రోజూ ఏడ్చేది. దాని బాధ చూడలేక, నేను కూడ స్వయంగా వెతికాను. కానీ, ప్రయోజనం లేకపోయింది బాబూ!......

వారం రోజులు గడచిన తరువాత ఎక్కడనుంచో ఒక కబురు వచ్చింది.

ఆది పక్కింటి పంతులుగారితో చదివించాను. అది మా రంగయ్య దగ్గరనుంచే వచ్చింది. తను చెప్పకుండా మిలిటరీలోకి వెళ్ళిపోయాననీ, మేమమంతా అతనికోసం దిగులు పడవద్దనీ వ్రాశాడు బాబూ!...

నేనెంతో బాధపడ్డాను. వాడి పెళ్ళాం కూడ ఎంతో ఏడ్చింది. అయినా అంతా అయిపోయాక ఏం చెయ్యగలం? అంతా ఇక వాడి యిష్టం, అని సరిపెట్టుకొని వూరుకున్నాను. రెండేళ్ళు అలా గడచిపోయాయి. రంగయ్య ఒకటి రెండు పర్యాయములు యింటికి వచ్చిపోయాడు. ఇంతలో.... రెండవ ప్రపంచ యుద్ధం వచ్చింది. అప్పటి తెల్లపటాలంతో దేశం విడిచి, యుద్ధానికి వెళ్ళిన రంగయ్య, యుద్ధంలో చచ్చిపోయాడనే వార్త వచ్చింది. దాంతో నా గుండెలు ఆగిపోయినంత పని జరిగింది. ఆ ఒక్క అత్మ పోవడంతో, వాడి పెళ్లాం ఇల్లు విడిచి వెళ్ళిపోయింది. దానితో మానసికంగా, శారీరకంగా ఎంతో జబ్బుపడిపోయాను...

అప్పటినుండి నాకు కష్టాలు ప్రారంభమయ్యాయి బాబూ! ఈ వృద్ధాప్యంలో నాకు అంధత్వం ప్రాప్తించింది. ఆఖరు సమయంలో నా దాయాదులు స్వార్థంతో నాకు సేవచేసి, వున్న ఆ కాస్త భూమిని దక్కించుకుని నన్ను దేశాలపాలు చేసారు బాబూ!...ఆ అంధ భిక్షుకుని కళ్ళనుండి అశ్రువులు ప్రవహించాయి...

వాళ్లను అనుకొని ఏం ప్రయోజనం బాబూ! ఆ సమయంలో నేను ఒంటరిగాడిని. కొడుకు యుద్ధంలో చచ్చిపోయాడు. కోడలు వెళ్ళిపోయింది. ఇక ఏ దిక్కూ లేదు. అప్పటినుండి యిప్పటి వరకూ, ఈ గుడ్డితనంతో, చావలేక, బ్రతకలేక, బ్రతుకును భారంగా గడుపుతున్నాను బాబూ!...అతని గొంతు జీరపోయింది. కళ్ల నుండి అశ్రువులు ధారగా ప్రవహించాయి.

ఆ అంధ భిక్షువు కథ ముగించి, తన గుడ్డికళ్ళతో నావైపు చూసాడు. అతని కథ విన్నతరువాత అతనిపై ఒక విధమైన జాలీ, సానుభూతీ కలిగాయి. చాలా బాధించాను...

పాపం! ఒకప్పుడు సంఘంలో గౌరవంగా బ్రతికి చెడిపోయిన వ్యక్తి. ముసలితనంలో ఏ దిక్కూ లేక, తన ఒక్కడి పొట్టకోసం కష్టాలు పడుతున్న అంధ భిక్షువు. విధి ఎంత బలీయమైనది. సుఖం వెనకనే కష్టం కూడ వెన్నంటి తరుముతుంది కాబోలు, అనుకుని నిట్టూర్చాను.

నేనేమీ మాట్లాడకపోవడంతో అంధభిక్షువు ఏం బాబూ! నా కథ వినగానే అసహ్యం కలిగిందా? అని అడిగాడు.

లేదు తాతా! నీ మీద జాలే కలిగింది. కానీ మానవులం. మనం ఏం చెయ్యగలం? అంతా ఎవరి కర్మానుసారం వారికి అంతే జరుగుతోంది, అన్నాను, ఇంకేమీ అనలేక...

అంతే!...అంతే బాబూ!...అంతా మనం చేసుకున్న ఖర్మ, అంటూ వెళ్ళడానికి లేచాడు.

తాతా!... ఇపుడు ఎక్కడకు వెళతావు. అన్నం తిని వెళ్ళు అన్నాను. ఆ అంధభిక్షువు మరల కూర్చుండిపోయాడు...

మధ్యాహ్నం ఆ గుడ్డివానికి కడుపునిండుగ అన్నం పెట్టించాను. అతను ఎంతో సంతోషంతో భుజించాడు... సెలవు అడిగి వెళ్ళిపోయాడు ఆ అంధ భిక్షువు.

పాపం!...నిర్భాగ్యుడు... అనుకున్నాను మనస్సులో.

× × ×

ఆ మరునాడు ఉదయం ఆఫీసుకు వెళుతున్నాను. మార్కెటు జంక్షనులోకి వచ్చేసరికి అంతా గుమికూడి దేనినో చూస్తున్నారు. నాకుకూడ, అదేమిటో చూడాలని కుతూహలం కలిగింది...పాపం! ఎవరో అడుక్కునేవాడు లారీ క్రింద పడ్డాడు, అంటున్నారెవరో!...

దగ్గరకు వెళ్ళి చూసాను ఎవరోనని. తొంగి చూడగానే నా గుండెలు ఆగిపోయినంత పనయింది. క్షణం నోటి మాట రాలేదు. మౌనంగా, ఆఫీసు దారి పట్టాను...

నా మనసులో ఒకటే ఆలోచన. నిన్న మధ్యాహ్నం అన్నం పెట్టిన ఆ గుడ్డివాడు, ఈ ఉదయం నాకు నడిరోడ్డుమీద శవాకారంలో కనిపించాడు...

పాపం! గుడ్డివాడు, అనుకున్నాను సానుభూతిగా...